క్లుప్తంగా

27న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

ఆదిలాబాద్‌టౌన్: కేంద్రీయ విద్యాలయంలో 2025–26 అకాడమిక్ సంవత్సరంలో కాంట్రాక్ట్ పద్ధతిన బోధించేందుకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులకు ఈనెల 27న వాక్‌ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించడం జరుగుతుందని పాఠశాల ప్రిన్సిపల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీటీ హిందీ, ఇంగ్లీష్, సాంఘిక శాస్త్రం, గణితం, సైన్స్, సంస్కృతం, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, స్పోర్ట్స్ కోచ్, కౌన్సిలర్, స్టాఫ్ నర్స్, స్పెషల్ ఎడ్యూకేటర్, డ్యాన్స్ టీచర్, రీజినల్ లాంగ్వేజ్ తెలుగు పోస్టుల కోసం ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): మహిళలు పౌష్టికాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని జైనథ్ ఐకేపీ ఏపీఎం భగవాండ్లు అన్నారు. మహిళ సంఘాల సభ్యులకు శుక్రవారం జైనథ్ మండల కేంద్రంలో ఆరోగ్య పరిరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళ సంఘాల సభ్యులు పౌష్టికాహారం గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలతో పాటు పోషక విలువలు గల ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీసీలు నాందేవ్, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గంగారాం, లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రతులు దహనం

ఎదులాపురం: ఫిబ్రవరి 4న సోషల్ జస్టిస్ డేగా నిర్ణయించడాన్ని, షమీమ్ అక్తర్ ఏకసభ్య కమిషన్ రిపోర్టును మాల, మాల ఉప కులాలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ శుక్రవారం ఎస్సీ వర్గీకరణ ప్రతులను దహనం చేశారు. అనంతరం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. 2025 జనాభా ప్రకారం ఎస్సీ కుల గణన చేసి మాల జనాభాను గుర్తించాలని డిమాండ్ చేశారు. రమేశ్, రాఘవేంద్ర ప్రజ్ఞా కుమార్, నాగారావు, విట్టల్ కాంతారావు, దయాశీల పాల్గొన్నారు

ప్రభుత్వ కళాశాలల్లో చేరాలి

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేరాలని ఆదిలాబాద్ పట్టణంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శివకృష్ణ అన్నారు. శుక్రవారం కళాశాలలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గురుకుల కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించడం జరుగుతుందని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో లెక్చరర్లు సునీల్ కుమార్, రామకృష్ణ, జితేందర్, సురేందర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సమావేశంలో ప్రభాకర్‌రెడ్డి

ఎదులాపురం: హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో శుక్రవారం నిర్వహించిన సీపీఐ రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశంలో జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించిన, భవిష్యత్‌లో చేపట్టబోయే పోరాటాల గురించి మాట్లాడారు. జిల్లా సమగ్ర నివేదికను సమర్పించి సమస్యలను తెలియజేశారు.

'మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలి'


ఎదులాపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి మంచికట్ల ఆశమ్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మాట్లాడారు. జిల్లా నుంచి మొదటిసారి నామినేషన్ వేశానని, 30 ఏళ్ల రాజకీయ అనుభవం కలిగిన తనను ఆదరించి గెలిపించాలని కోరారు.

సోలార్ దొంగల అరెస్టు

సిరికొండ: మండలంలో వివిధ గ్రామాల్లో అటవీ జంతువుల బారి నుంచి పంట రక్షణ కోసం చేలలో ఏర్పాటు చేసుకున్న సోలార్ పరికరాలను చోరీ చేసిన ముగ్గురు దొంగలను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శివారం తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామన్నారు. ఎవరైనా దొంగతనం చేసినా.. ప్రోత్సహించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పింఛన్ కోసం ఎదురుచూపు

- నాలుగేళ్లుగా మంజూరు కాని వైనం
- ఇబ్బంది పడుతున్న వితంతువులు, వృద్ధులు



సిరికొండ ఎంపీడీవో కార్యాలయం

సిరికొండ: గత ప్రభుత్వం ఆసరా పింఛన్ మంజూరు ఆలస్యంతో లబ్ధిదారులకు పింఛన్ పథకం దరి చేరలేదు. అప్పటికే ఎదురుచూసి అలసిన కళ్లకి నూతన ప్రభుత్వం ఏర్పాటుతో మళ్లీ ఆసరా పింఛన్ పథకం లబ్ధిదారులకు ఆశలు చిగురించాయి. నూతన ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా.. ఆసరా పింఛన్ పథకం ఊసు లేకపోవడంతో వితంతువులు, దివ్యాంగులు ఎదురుచూస్తున్నారు.

దరఖాస్తులకే పరిమితం..

గత ప్రభుత్వం నూతనంగా వితంతువులకు, దివ్యాంగులకు ఆసరా పింఛన్ అందించడంలో నిర్లక్ష్యం చేసింది. కొన్ని సమయంలో గ్రామ పంచాయతీల ద్వారా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులను అర్హుల వద్ద నుంచి స్వీకరించారు. పింఛన్ కోసం అర్హులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ వారికి ఆసరా మాత్రం వర్తించలేదు. మరోసారి ఆన్‌లైన్‌లో 65 సంవత్సరాలు వయస్సు నిండిన వారికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించినా.. వితంతువులకు మాత్రం ఇవ్వలేదు. దీంతో వృద్ధాప్య పింఛన్ మాత్రమే మంజూరైంది. వితంతు పింఛన్ మంజూరు కాలేదు.

నాలుగు సంవత్సరాలుగా..

గత ప్రభుత్వం మూడు సంవత్సరాలుగా ఆసరా పింఛన్ అమలు చేయలేకపోవడంతో మండలంలోని ఆసరా పథకానికి దూరమయ్యారు. నూతన ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడుస్తున్నా.. ప్రభుత్వం కూడా ఆసరా పథకం అమలు చేయకపోవడంతో ఎదురుచూస్తున్నారు. ఇటీవలే ప్రజా పాలనాలో రేషన్ కార్డులు, ఇళ్లు మంజురు చేశారు. కానీ ఆసరా పథకం ద్వారా పింఛన్ కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు మాత్రం తీసుకోకపోవడంతో ఇప్పట్లో పింఛన్ ప్రభుత్వం ఇచ్చే యోచనలో లేదు. అర్హుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పింఛన్ మంజురు చేయాలని వారు కోరుతున్నారు.

అమలు చేయాలి



నాభర్త గత నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో వితంతు పింఛన్ కోసం అప్పటి నుంచి ప్రతిసారి దరఖాస్తు చేస్తునే ఉన్నా.. కానీ ఇప్పటి వరకు పింఛన్ పథకం అమలు చేయడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆసరా పింఛన్ అమలు చేయాలి.

– గుగ్గిల్ల పెద్ద లింగమ్మ, సిరికొండ

పట్టించుకోని ప్రభుత్వం



ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం, గతంలో పని చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం వితంతువులను పట్టించుకోవడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా.. అర్హులైన వితంతువులకు ఆసరా పథకం అమలు చేయడంలో విఫలమైంది.

– బోయిన్‌వాడ్ అమోల్, బీజేపీ మండల అధ్యక్షుడు

ఎలాంటి ఆదేశాలు రాలేదు

ఆసరా పథకం కింద అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించమని ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వస్తే తప్పకుండా దరఖాస్తులు స్వీకరిస్తాం. గతంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కూడా పింఛన్ పథకం అమలు చేస్తాం.

– రవీందర్, ఎంపీడీవో, సిరికొండ

ప్రజా సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లో తీసుకెళ్లాలని, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కష్ట పడిన ప్రతీ కార్యకర్తకు పార్టీ అండగా నిలుస్తుందని తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు పనిచేయాలన్నారు. సమావేశంలో నాయకులు ఖయ్యుం, సామ ప్రభాకర్‌రెడ్డి, చంద్రయ్య, ఎక్బాల్, తదితరులు పాల్గొన్నారు.

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లోని గాంధీభవన్ టీపీసీసీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుల గణన, ఎస్సీ వర్గీకరణపై శుక్రవారం నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి: ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా కల్పిస్తున్న ఉపాధిపనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో రవీందర్ అన్నారు. మండలంలోని మర్కగూడ, నవగూడ సమీపంలో అటవీశాఖ పరిధిలో జరుగుతున్న చెక్‌డ్యాం నిర్మాణ పనులను అటవీ అధికారులు అడ్డుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం అటవీ అధికారులు, ఈజీఎస్ అధికారులతో కలిసి చెక్‌డ్యాం పనులను పరిశీలించారు. అనంతరం నవగూడ, మర్కగూడ గ్రామస్తులతో గ్రామసభ నిర్వహించి చెక్‌డ్యాం నిర్మాణ పనులు ప్రారంభించేందుకు తీర్మానం చేశారు. ఉపాధి పనులను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో సంతోష్‌కుమార్, ఎంపీవో జీవన్‌రెడ్డి, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్ మహేందర్, తదితరులు పాల్గొన్నారు.


చెక్‌డ్యాం మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో రవీందర్

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పల్లి(కె) గ్రామంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సవారి బంగ్లాకు భూమిపూజ చేశారు. అనంతరం శబరిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామానికి అన్నివిధాలుగా అండగా ఉంటాన్నారు. అనంతరం మండలంలోని ఖోడద్ గ్రామానికి చెందిన పన్నాల కిష్టన్న ఇటీవల మరణించగా కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి, తోట వెంకటేశ్, కేదరేశ్వర్ రెడ్డి, లింగారెడ్డి, పాండు, లక్ష్మణ్, మాజీ సర్పంచ్ రమేశ్‌రెడ్డి, అభిరామిరెడ్డి, నవీన్ రెడ్డి, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సమస్యల పరిష్కారానికి కృషి

ఇచ్చోడ: గిరిజన గ్రామాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుబ్బ, బాధిగూడ గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిసి శాలువాతో సత్కరించారు. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఇచ్చోడ మాజీ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, మాజీ ఎంపీటీసీ శివకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నమూనా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

తాంసి: జిల్లాలోని ప్రతీ మండల కేంద్రంలో ఇందిరమ్మ నమూనా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న జిల్లా హౌసింగ్ పీడీ బసవేశ్వర్ అన్నారు. శుక్రవారం తాంసి మండల కేంద్రంలో నమూనా భవన నిర్మాణ పనులు అధికారులతో కలిసి ప్రారంభించారు. భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇప్పటికే మూడు మండలాల్లో పనులు ప్రారంభించినట్లు వివరించారు. పీడీ వెంట డీఈ శంకర్, ఏఈ నజీర్, సిబ్బంది ఉన్నారు.


పనులు పరిశీలిస్తున్న పీడీ బసవేశ్వర్

'ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలి'

ఇంద్రవెల్లి: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యతో పాటు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డిల గెలుపు కోసం కృషి చేద్దామని బీజేపీ మండల అధ్యక్షుడు ఆరెల్లి రాజలింగు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆర్క ఖమ్ము, జైస్వాల్ శివకుమార్, పెందోర్ గణేష్, కేంద్రే బాలు, మెస్రం తుకారం, కనక హనుమంత్‌రావ్, ముండే రాజేశ్వర్ పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజావాణి సద్వినియోగం చేసుకోవాలి

- ఆర్డీవో వినోద్ కుమార్

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో వినోద్ కుమార్ అన్నారు. శుక్రవారం జైనథ్ మండల కేంద్రంలోని రైతుసంఘ భవనంలో ప్రజా ఫిర్యాదు పరిష్కార కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 52 లబ్ధిదారులు తమ సమస్యలను పరిష్కరించేందుకు దరఖాస్తులు చేసుకున్నారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు ఆయా శాఖ అధికారులు వివరాలను వెల్లడించారు. ప్రజలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి భాస్కర్ నాయక్, జైనథ్ తహసీల్దార్ ఆత్రం నారాయణ, భోరజ్ తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరి, సాత్నాల తహసీల్దార్ విశ్వనాథ్, ఎంపీడీవో శ్యాంసుందర్, భోరజ్ ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం గత నెల రోజులుగా నిర్వహించిన పైలెట్ ప్రాజెక్టు ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులపై బహిరంగ విచారణ వేదిక నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి మనోహర్ రావు దరఖాస్తుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడించి 25 దరఖాస్తుల్లో 4 దరఖాస్తులను సత్వరమే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్ కుమార్, తహసీల్దార్ రఘునాథరావు, ఏవో సాయితేజ రెడ్డి, ఏఈలు శాంతి కుమార్, హరీష్, ఏఈవోలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో వినోద్‌కుమార్

ఇచ్చోడ: ఎక్కడి సమస్యలు అక్కడే పరిష్కారించేందుకే మండల కేంద్రాల్లో ప్రజా ఫిర్యాదులు పరిష్కార ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. దరఖాస్తులను స్వీకరించి, వాటి పరిష్కారానికి అక్కడే చర్యలు తీసుకొనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మణ్, వ్యవసాయాధికారి జాదవ్ కైలాస్, ఎంపీవో సత్యానంద్, అధికారులు పాల్గొన్నారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న సీఈవో జితేందర్‌రెడ్డి

ఘనంగా భీమాబాయి అంబేడ్కర్ జయంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ మాతృమూర్తి భీమాబాయి అంబేడ్కర్ 171 జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహామాయ ఉపాసిక సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని త్రిరత్న బుద్ధ విహార్ వద్ద భీమబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల నాయకులు మస్కే రాజువర్దన్, సోన్‌కాంబ్లే ప్రభాబాయి, మాయవతి, ఉజ్వాల, మధుమాల, లతబాయి పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

ఆదిలాబాద్‌టౌన్: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వృక్షార్చన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ తలపెట్టిన వృక్షార్చన కార్యక్రమలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో నాయకులు మెట్టు ప్రహ్లాద్,, యాసం నర్సింగ్ రావ్, విజ్జగిరి నారాయణ, అలాల్ అజయ్, సాజిదొద్దీన్, అశోక్ స్వామి, దాసరి రమేశ్, ధమ్మపాల్, శ్రీనివాస్, బట్టు సతీష్, బుట్టి శివ, శంకర్ పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జోగు రామన్న

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

నేరడిగొండ: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినం సందర్భంగా శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మొక్కలు నాటారు. రాష్ట్రమంతటా వృక్షార్చనలో భాగంగా మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ నిర్వహిస్తున్న మూడు మొక్కలు నాటండి.. సెల్ఫీ దిగండి కార్యక్రమంలో భాగంగా మూడు మొక్కలు నాటి సెల్ఫీ దిగి కేసీఆర్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె)లో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుస్తు జన్మదిన వేడుకలను గ్రామస్తులు నిర్వహించారు. పంట పొలంలో కేసీఆర్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి క్షీరాభిషేకం చేశారు. మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు నివాళి


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న విద్యార్థినులు

ఉట్నూర్‌రూరల్: పుల్వామాలో జరిగిన ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు ఉట్నూర్ ట్రైబల్ వెల్ఫేర్ గురుకులం బాలికల కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థినులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కోఆర్డినేటర్ నాగశ్రావణి, మానస, జాడి సరిత, ఎన్‌సీసీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

బేల: మహిళలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐకేపీ ఏపీఎం సుజాత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పద్మావతి మండల సమైక్య సమావేశ మందిరంలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలు పెరిగే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఐకేపీ సీసీలు శరత్ రెడ్డి, ప్రమోద్, దేవానంద్, లక్ష్మి, మహిళ సమైఖ్య అధ్యక్షురాలు మంజూష, కార్యదర్శి భీంభాయి, వీవోఏలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

బోథ్: బోథ్ మండలంలోని కొట శివరాంలో రాంనగర్ మలుపు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని మహారాష్ట్ర చెందిన వ్యక్తి మతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. రాత్రి 10 గంటల ప్రాంతంలో మహారాజు చెందిన అరవింద్ అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు.

'అభివృద్ధిని చూసే పార్టీలో చేరికలు'


నాయకులతో ఆడే గజేందర్

నేరడిగొండ: కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసే పలువురు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గజ్జల అశోక్‌తో పాటు పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సింగారపు స్వామి, సుంక భీమన్న, మాదుగంపల్లి గంగాధర్, బెర్గేడి సతీష్, మహేశ్ పాల్గొన్నారు.

నేడు సన్నాహక సమావేశం

నేరడిగొండ: బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన సందర్భంగా జన్మదిన వేడుకల గురించి చర్చించడం జరుగుతుందన్నారు.